క్లుప్తంగా

అభివృద్ధిలో పాలకవర్గం పాత్ర కీలకం



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ

పరిగి: గ్రామాభివృద్ధిలో పంచాయతీ పాలక వర్గం పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధి రంగాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ అంటే ఎంతో ఓపికతో ఉండాలని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సేవలందించాలన్నారు. పార్టీలను పక్కన పెట్టి, అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంతో సర్పంచ్, వార్డు సభ్యులు ముందుంటారని పేర్కొన్నారు. ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ దయానంద్, సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వారి సేవలు అమోఘం



సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం

పెద్దేముల్: సర్పంచ్ వీరప్ప, ఉప సర్పంచ్ వెంకటయ్యలు గ్రామానికి చేసిన సేవలు అమోఘమని అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ సభ్యులు కొనియాడారు. పంచాయతీ పాలకుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మంగళవారం గాజీపూర్ సర్పంచ్, ఉప సర్పంచిని సంఘం సభ్యులు సన్మానించి మాట్లాడారు. ఐదేళ్లు ప్రజల మధ్యే ఉంటూ.. ప్రజా సమస్యలను పరిష్కరించారన్నారు. ఇందులో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు గడ్డమీది ఎల్లప్ప, గుడాల శేఖర్, సహని నర్సింహ, గొట్లపల్లి ప్రవీణ్, శ్రీను, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం



జీపీ భవనం ప్రారంభోత్సవంలో ఎంపీపీ విజయలక్ష్మి తదితరులు

ధారూరు: స్థానిక పాలకుల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధి మైలారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని మంగళవారం ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా జీపీ భవన నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చిన నవాబ్‌మీర్ సాజిద్ అలీఖాన్‌ను ఆమె అభినందించారు. సర్పంచ్ బాబ్యానాయక్, వాలిబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఇబ్రహీం, విజయ్, శ్రీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ

దౌల్తాబాద్: కుష్టువ్యాధిపై మండల పరిధి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌమ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కుష్టువ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ రఫీ, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

ఆలయ చైర్మన్ పదవి పటేల్‌కు ఇవ్వాలి



ఎమ్మెల్యే బీఎమ్మార్‌తో మాట్లాడుతున్న గ్రామ నాయకులు

తాండూరు రూరల్: చంద్రవంచ గ్రామం ఆంజనేయస్వామి దేవాలయ చైర్మన్ పదవిపై ఉత్కంఠ నెలకొంది. పటేల్ మహేందర్‌రెడ్డికి చైర్మన్ ఇవ్వాలని కోరుతూ కొందరు గ్రామ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి విన్నవించారు. దేవాదాయ శాఖ కింద 40 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని కౌలుకు ఇస్తే.. వచ్చిన డబ్బుతో గుడి నిర్మించుకోవచ్చని నాయకులు సూచించారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే బీఎమ్మార్ గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ కార్యకర్త అనంతయ్యకే చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ గ్రామ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో చైర్మన్ పదవి ఎవరికి ఇవ్వాలా అనే సందిగ్ధంలో ఎమ్మెల్యే ఉన్నట్లు సమాచారం. ఎవరికి ఇస్తే ఏం పరిణామాలు చోటు చేసుకుంటాయోనని గ్రామస్తులు వేచి చూస్తున్నారు.

ఆదర్శం.. అనుసరణీయం

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు సకల జనులు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడారు. ఒక్క రక్తపు బొట్టు చిందకుండా.. అహింసే ఆయుధంగా.. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గాంధీజీ గడగడలాడించారని తెలిపారు. బానిస సంకెళ్లు తెంచి, కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛను ప్రసాదించారన్నారు. స్వయం నిర్ణయాధికారాలను బహుమతిగా అందించారని కొనియాడారు. అలాంటి మహానుభావుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

- అహింసే మహాత్మాగాంధీ మార్గం
- జాతిపిత మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి
- గాంధీ వర్ధంతిలో అధికారులు, నేతలు



తాండూరు టౌన్: గాంధీచౌక్‌లో జాతిపిత విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీని భారతీయులు ఎప్పటికీ మరువలేరని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఆయన విగ్రహానికి, కార్యాలయంలోని చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. గాంధీ ఎంచుకున్న సత్యం, ధర్మం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, అనుసరించాలని కోరారు. నాయకులు రవి, సోమశేఖర్, నీరజ, పట్లోళ్ల నర్సింహులు, మమత, ప్రభాకర్ గౌడ్, హబీబ్‌లాలా, వడ్డే శ్రీనివాస్, ప్రవీణ్ గౌడ్ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

గాంధీ వర్ధంతి సందర్భంగా.. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపం ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘం సభ్యులు తిప్పయ్య, విజయలక్ష్మి, సిద్దన్న, శ్రీనివాస్, కోట మురళి, సంతోష్, రాఘవేందర్, శివకుమార్, నర్సింహులు, చంద్రశేఖర్, సరిత, నాగలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

బొంరాస్‌పేట: జాతిపిత మహాత్మాగాంధీ దేశానికే ఆదర్శమని టీవీవీ నాయకులు, మండల ఉపాధ్యాయులు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రం వద్ద గాంధీ విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, టీవీవీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్ష్మి, జిల్లా నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, హెచ్‌ఎంలు కాశీపతి, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీప్రియ, అనురాధ, శశి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: అహింసా మార్గాలే ఆయుధంగా మలుచుకొని, స్వాతంత్ర్యం సాధించిన మహాత్ముడు గాంధీ అని, ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, దండు అశోక్, చిన్న నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఇందులో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కిషన్‌రావు, విద్యాసాగర్, మాజీ సర్పంచ్ బాలప్ప, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, వ్యాపారి వెంకటేశం, నాయకులు నర్సింహులు, గోపాలకృష్ణ, పెంటప్ప, శ్రీను, రాజు, షబ్బీర్ ఉన్నారు.

గాంధీ బాటలో..

వికారాబాద్ అర్బన్: అహింసే ఆయుధంగా దేశానికి స్వేచ్ఛను కల్పించిన మహాత్ముడి బాటలో నడవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీ పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు యాస్కి సునీల్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో..

స్వాతంత్ర పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించారని, వారి గురించి భావితరాలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనందిపై ఉందని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో యువజన సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్, సర్పంచ్ కొత్తరంగారెడ్డి, బి.వెంకటేశ్, రాము తదితరులు ఉన్నారు.



అనంతగిరి: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



పరిగిలో.. కాంగ్రెస్ నాయకులు



పెద్దేముల్‌లో..



వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు



తాండూరు టౌన్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో



వికారాబాద్ అర్బన్‌లో.. చైర్‌పర్సన్ తదితరులు



కుల్కచర్ల: చౌడాపూర్‌లో..



బొంరాస్‌పేటలో టీవీవీ నాయకులు తదితరులు

నేటితో పన్ను వసూలు ముగింపు

ధారూరు: నేటితో ఆస్తి పన్ను వసూలు కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ప్రక్రియలో వేగం పెంచారు. మండల పరిధి 32 గ్రామాల్లో మొత్తం రూ.40.93లక్షలు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.33.22లక్షలు వచ్చాయని, ఇంకా రూ.7లక్షలకు పైగా రావాల్సి ఉందని మంగళవారం ఎంపీఓ షఫీఉల్లా తెలిపారు. నిర్ణీత గడువులోగా లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీఓ వెల్లడించారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

యాలాల: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని ఎస్‌ఐ శంకర్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధి అచ్యుతాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ వీరానందం, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఐ నారాయణరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పిట్ల శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి..

యాలాల: మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి ఆయన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. యాలాలలో సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీ, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే.. పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కలుగుతుందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో కాంగ్రెస్ నాయకులు హన్మంతు, రాపోలు నాగయ్య, గంతల అహ్మద్, మోయిజ్, అంజిలయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులకు తగిన ప్రాధాన్యం

కుల్కచర్ల: పారిశుద్ధ్య పనులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం కుల్కచర్ల గ్రామ ప్రధాన చౌరస్తాలో మురుగుకాల్వలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని, చెత్తను బహిరంగ ప్రదేశాలు, మురుగుకాల్వల్లో వేయరాదని సూచించారు. చెత్త తరలించే వాహనానికి అందించాలని కోరారు.

చట్టం దృష్టిలో అందరూ ఒక్కటే



కుల్కచర్ల: సమావేశంలో సూచనలు చేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం



మర్పల్లి: బిల్‌కల్ గ్రామంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి

- కులం మతం పేరుతో దూషించొద్దు
- అంటరాని తనాన్ని రూపుమాపాలి
- పౌరహక్కుల దినోత్సవంలో అధికారులు

కుల్కచర్ల: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని తహసీల్దార్ ప్రభులు, కుల్కచర్ల ఎస్‌ఐ శ్రీశైలం అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చౌడాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఒకరి హక్కులకు భంగం కలిగే హక్కు మరొకరికి లేదని చెప్పారు. సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి అందరికీ అవగాహన ఉండాలని సూచించారు. కులం, మతం పేరుతో దూషించరాదని చెప్పారు. కార్యక్రమంలో గిర్దావరి వెంకటగిరి, సర్పంచ్ కొత్తరంగారెడ్డి, నాయకులు వెంకటేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా..

మర్పల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఘణాపూర్‌లో సర్పంచ్ పడుమటి శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. అంటరానితనాన్ని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. సమాజంలో అందరూ కలిసిమెలిసి జీవించాలని చెప్పారు. తమ పిల్లలను విద్యావంతులను చేయాలని, చిన్నతనంలో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ చట్టాల గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. ఇందులో సిరిపూరం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ తుల్జారాంగౌడ్, ఆర్‌ఐ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



పెద్దేముల్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఐ రాజిరెడ్డి

వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు

పెద్దేముల్: కుల వివక్ష లేకుండా, ప్రతి ఒక్కరూ సమాన హక్కులను కలిగి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి సూచించారు. బండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పౌర హక్కుల అవగాహనలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అవలంభిస్తే కేసు పెట్టడం జరుగుతుందన్నారు. చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

పౌర హక్కులను కాపాడుదాం

కొడంగల్: పౌర హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ పాండు, ఎంపీఓ శ్రీనివాస్, ఏఎస్‌ఐ బాలకిషన్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అన్నారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమాజంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించాలని, ఎవరి హక్కులకు భంగం కలిగించరాదని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమ్న జాతులను కించపర్చడం నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ నర్సింహులు, ఎస్‌ఐ రవిగౌడ్

దోమ: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. మండల పరిధి ఐనాపూర్‌లో పౌర హక్కులపై నిర్వహించిన అవగాహనలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన ఉండాలని, నిమ్న జాతుల వారిని కించపర్చడం, పౌరహక్కులకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కేసులు పెడతామన్నారు. ఇందులో ఆర్‌ఐ సుదర్శన్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శంకర్, ఏఎస్‌ఐ సూర్యనారాయణచారీ, సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ విజయ, వార్డు సభ్యులు ఉన్నారు.

మోమిన్‌పేటకు మహర్దశ

- మారనున్న రూపురేఖలు
- శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఫ్యాక్టరీల ఏర్పాటుతో పెరిగిన ఉపాధి అవకాశాలు



మోమిన్‌పేటలో విస్తరించిన రోడ్డు

మోమిన్‌పేట: అభివృద్ధి పథంలో మోమిన్‌పేట గ్రామం దూసుకుపోతోంది. ఇప్పటికే గ్రామంలో రూ.10కోట్ల నిధులతో రెండు కిలో మీటర్ల మేర రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించారు. 900 మీటర్ల సీసీరోడ్డు, 1100 మీటర్ల బీటీ రోడ్డును నిర్మించారు. బీటీని మరో లేయర్ వేయాల్సి ఉంది. ఇందులో మిగిలిన రూ.2కోట్ల నిధులతో కల్వర్టు నిర్మించాల్సి ఉండగా.. ఆ నిధులతో సెంట్రల్ లైటింగ్ సిస్టం, రెండు ఫీట్ల ఎత్తుతో డివైడర్లను నిర్మించాలని ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తే.. పల్లెకు కొత్తకళ సంతరించుకుంటుందని గ్రామస్తులు చెప్పారు.

ఉపాధికి చిరునామా..

మోమిన్‌పేట, మొరంగపల్లిలో ప్రైవేటు కర్మాగారాలు కొలువుదీరగా.. స్థానికులే కాకుండా.. ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి ఉపాధి పొందుతున్నారు. మేకవనంపల్లిలో మరో ప్రైవేటు ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అంతే కాకుండా ఏన్కతలలో మొబిలిటీ వ్యాలీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూసేకరణ జరగగా.. ఇది ఏర్పాటైతే.. ఉపాధి కోసం వచ్చే వారికి పెద్ద ఎత్తున ఆవాసాలు కావాల్సి ఉంటుంది. అందుకు మోమిన్‌పేటలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగనుంది.

రహదారుల విస్తరణ చేపట్టాలి..

సదాశివపేట నుంచి జిల్లా హెడ్‌క్వార్టర్ వికారాబాద్ వరకు, శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా బుద్దెర వరకు, మోమిన్‌పేట నుంచి తాండూరు వరకు కూడా నాలుగు వరుసల రోడ్డు వెడల్పు అనివార్యం. జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో, రహదారి విస్తరణ పనులకు నిధులను పెద్ద మొత్తంలో మంజూరు చేస్తారనే ఆశలో మండల ప్రజలు ఉన్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆలోచించాలని కోరుతున్నారు. హైదరాబాద్‌కు సమీపాన ఉన్న రోడ్లే అధ్వానంగా ఉన్నాయని, వాటిని మరమ్మతు చేయటమే కాకుండా.. రోడ్ల విస్తరణకు చొరవ చూపాలని కోరుతున్నారు.

నిధుల మంజూరుకు కృషి



నియోజకవర్గంలో రోడ్ల వస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సదాశివపేట నుంచి వికారాబాద్, మొరంగపల్లి నుంచి తాండూరు, శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట మీదుగా బుద్దెర వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణకు సీఎం దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేస్తాం.

– నరోత్తంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు

ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు



కల్వర్టు నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు ఉన్నాయి. దానికి బదులుగా డివైడర్ ఎత్తు పెంచడం, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులు మా దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం.

– రవికుమార్, ఏఈఈ ఆర్‌అండ్‌బి

'ప్రత్యేక' అధికారులు వీరే..

ధారూరు: గ్రామాల్లో ప్రత్యేక పాలనకు అధికారులను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచుల పదవీకాలం రేపటితో ముగియనుండటంతో వారి స్థానంలో మండల పరిధి 32 గ్రామాలకు అధికారులను ప్రభుత్వం నియమించిందని ఆయన పేర్కొన్నారు.

ఏ ఊరికి ఎవరు?

రాంపూర్‌తండా గ్రామ పంచాయతికి వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్, ధారూరు జీపీకి తహసీల్దార్ భువనేశ్వర్, అంతారంకు ఏపీఓ సురేష్, అల్లాపూర్‌కు ఏఈఓ త్రైలోక్య, అల్లీపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిబాయి, అంపల్లికి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ యాదయ్య, చింతకుంటకు ఎంపీఓ షఫీఉల్లా, ధర్మాపూర్‌కు స్కూల్ అసిస్టెంట్ గుణవంత్‌రెడ్డి, స్టేషన్‌ధారూరుకు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, దోర్నాల్‌కు స్కూల్ అసిస్టెంట్ భాస్కర్, ఎబ్బనూర్‌కు ఏఈఓ సుజాత, గడ్డమీది గంగారంకు సర్వేయర్ రమేశ్, గట్టెపల్లికి ఆర్‌ఐ నవీన, గురుదోట్లకు ఏఈఓ సంతోష్, హరిదాస్‌పల్లికి మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, కేరెళ్లికి స్కూల్ అసిస్టెంట్ రాంచంద్రయ్య, కొండాపూర్‌కలాన్‌కు సీనియర్ అసిస్టెంట్ శివానంద్, కుమ్మర్‌పల్లికి ఏపీఎం శ్రీనివాస్, కుక్కిందకు ఈఓ మంజుల, మైలారంకు ఆర్‌ఐ వీరేశం, మోమిన్‌కలాన్‌కు ఏఈఓ మల్లేశం, మోమిన్‌ఖురుద్కు డీటీ వి.విజయ్, మున్నూరుసోమారంకు ఈసీ రమేశ్, నాగారంకు హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, నాగసమందర్‌కు స్కూల్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, నాగ్‌సాన్‌పల్లికి ఏఈఓ హరిప్రసాద్, నర్సాపూర్‌కు మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, అవుసుపల్లికి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పీసీఎంతండాకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, రాజాపూర్‌కు స్కూల్ అసిస్టెంట్ మల్లేశ్, రుద్రారంకు సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్, తరిగోపులకు స్కూల్ అసిస్టెంట్ శివకుమార్ నియమితులైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వివరించారు.

సంక్షిప్త వార్తలు

● దశలవారీగా సమస్యల పరిష్కారం

వికారాబాద్ అర్బన్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కమిషనర్ జాకీర్ అహ్మద్‌లతో కలిసి 18,21,30వ వార్డుల్లో పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. సమస్యలను స్పీకర్ ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేక నిధులతో పరిష్కరిస్తామని వెల్లడించారు. మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, డీఈ ప్రశాంత్, కౌన్సిలర్లు సువర్ణ, కృష్ణ, కృష్ణారెడ్డి ఉన్నారు.

● అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాల పరిశీలన

మర్పల్లి: తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సిరిపూరం, ఘణాపూర్ గ్రామాల్లో మంగళవారం స్థలాలను పరిశీలించినట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు. అమరుల కుటుంబాలకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం స్థల పరిశీలన చేయాలని ఆదేశించిందని, ఈ మేరకే పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఆర్‌ఐ దశరథ్, సర్వేయర్ ఉన్నారు.

● సమయపాలన పాటించకపోతే చర్యలు

దౌల్తాబాద్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని ఎంఈఓ వెంకటయ్య హెచ్చరించారు. మంగళవారం మండల పరిధి అంతారం, సుల్తాన్‌పూర్, బాలంపేట కస్తూర్బా పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బాలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

● పదిలో వందశాతం ఉత్తీర్ణత లక్ష్యం

పరిగి: పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని నంబర్ 1 పాఠశాలలో మండల పరిధి ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, వాటిపైనే ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు.